క్లుప్తంగా

ప్రసన్నానంద స్వామికి సన్మానం



స్వామిని సన్మానిస్తున్న వాల్మీకి సంఘం నాయకులు

మడకశిర: కర్ణాటక రాష్ట్రం హరిహర క్షేత్రం ప్రసన్నానందస్వామిని మడకశిర వాల్మీకి సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. గురువారం హరిహర క్షేత్రం స్వామి మడకశిరకు వచ్చారు. కర్ణాటక రాష్ట్రం హరిహర క్షేత్రం వాల్మీకి పీఠం రాజనహళ్లిలో జరుగు జాతరకు వాల్మీకి కులస్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా వాల్మీకి సంఘం నేతల చేతుల మీదుగా జాతర పోస్టర్లను ఆవిష్కరించారు. అలాగే పట్టణంలోని కొల్లాపురదమ్మ దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాల్మీకి సంఘం అధ్యక్షుడు మోహన్, ఇతర వాల్మీకి సంఘం నాయకులు పాల్గొన్నారు.

బాలికలు ధైర్యంగా ముందుకెళ్లాలి

మడకశిరరూరల్: బాలికలు సమాజంలో ఎవరికీ బయపడకుండా విద్యతో పాటు ఇతర రంగాల్లోనూ ధైర్యంగా ముందుకెళ్లాలని డీఎస్పీ వెంకటేశ్వర్లు సూచించారు. గురువారం సాయంత్రం పట్టణంలోని వెంకటేశ్వర జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు పలు విషయాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ సమాజంలో మహిళలు, బాలికలు, విద్యార్థినులపై జరుగుతున్న అత్యాచారం, దాడులు వంటి ఘటనలను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఒక వేళ ఇబ్బంది కరమైన పరిస్థితులు వస్తే ధైర్యంగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి రక్షణ పొందాలన్నారు. కార్యక్రమంలో సీఐ రాగిరిరామయ్య, కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఆటల ద్వారా నైపుణ్యం పెంపొందించాలి



పిల్లలకు ఆటల ద్వారా అక్షరాలు నేర్పిస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: మండలంలోని ఆమిదాలగొంది అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం సూపర్‌వైజర్ శంకరమ్మ సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ కేంద్రాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు పిల్లల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే అటలు, పాటల ద్వారా అక్షరాలు నేర్పిస్తూ నైపుణ్యాన్ని పెంపొందించాలన్నారు. పిల్లల్లో సృజనాత్మకతను గుర్తించడానికి ప్రతి నెలా 5న ఈసీసీఈ డే నిర్వహిస్తామని తల్లులకు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: మండలంలోని జిల్లెడుగుంట ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో గురువారం నీలకంఠాపురం ఎల్వీ ప్రసాద్ కంటి నేత్ర విద్యా విజ్ఞాన సంస్థ ఆస్పత్రి ఆధ్వర్యంలో కంటి వైద్యశిబిరం నిర్వహించారు. టెక్నీషియన్స్ గోవర్దన్ గిరిధర్, శిల్ప 125 మంది విద్యార్థులతో పాటు వృద్ధులకు కంటి పరీక్షలు చేశారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు కంటి పరీక్షలు చేయించుకుని కంటి లోపం లేకుండా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం భూతన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలు సమయపాలన పాటించాలి



కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్న ఐసీడీఎస్ అధికారి నాగమల్లేశ్వరి

అగళి: అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు సమయపాలన పాటించి పిల్లలకు సకాలంలో మెనూ ప్రకారం వడ్డించాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి నాగమల్లేశ్వరి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ఆర్టీటీ భవనంలో అగళి, రొళ్ల మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పిల్లలకు బాలమృతం కచ్చితంగా అందించాలన్నారు. సూపర్‌వైజర్ ప్రతి వారం సెంటర్లను పరిశీలించాలన్నారు. అనంతరం మండల కేంద్రంలో అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ లీలావతి, అగళి, రొళ్ల మండల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వణికిస్తున్న చలి గాలులు

- చీకటి పడగానే చల్లగా మారుతున్న వాతావరణం
- బెంబేలెత్తుతున్న జనం



» హిందూపురంలో ఉండే నరేష్ ఉదయం 5 గంటలకు ఎంజీఎం గ్రౌండ్‌కు వాకింగ్‌కు వెళ్లడం అలవాటు. వారం రోజులుగా తలనొప్పి వస్తుండటంతో వైద్యుడి వద్దకు వెళ్లాడు. సైనసైటీస్‌గా వైద్యుడు నిర్ధారించి చల్లటి గాలుల్లో వాకింగ్ చేయడం మంచిది కాదని తెలిపారు. సూర్యోదయం తరువాత కాస్త కిరణాలు పడి చలి తగ్గిన తరువాత వెళ్లాలని సూచించారు.

» చిలమత్తూరుకు చెందిన నజీర్ అహ్మద్ అస్తమాతో బాధపడుతున్నాడు. వాకింగ్‌కు వెళ్ళేవాడు. నాలుగు రోజుల క్రితం అనారోగ్యానికి గురై బెంగళూరు ఆసుపత్రిలో చేరారు. త్వరగా కోలుకున్నా చల్లని గాలుల్లో తిరగడం వల్లనే అలా జరిగిందని వైద్యులు చెప్పారు.

హిందూపురంలో ఉష్ణోగ్రతలు ఇలా..

తేదీ	కనిష్ట ఉష్ణోగ్రత (డిగ్రీల్లో)
1.12.24	19
2.12.24	19
3.12.24	18
4.12.24	19
5.12.24	19



చలి మంట వేసుకున్న ప్రజలు

హిందూపురం అర్బన్: పట్టణంలో శీతల గాలులు చంపేస్తున్నాయి. సాయంత్రం అయ్యిందంటే చాలు వాతావరణం చల్లగా మారిపోతోంది. రాత్రి గడిచే కొద్దీ మరింత చలి పెరిగి జనాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. సాయంత్రం నుంచి ఉదయం వరకు జనం ఇళ్లకే అతుక్కు పోతున్నారు. బయటకు రావాలంటే జంకుతున్నారు. హిందూపురం, కదిరి, పెనుకొండ, మడకశిర ఇలా అన్ని ప్రాంతాల్లోనూ శీతల గాలులు వీస్తున్నాయి. వ్యవసాయ భూములు, చెరువుల్లో వాగుల్లో నీరు ఉన్న ప్రాంతాల్లో చలి మరింత ఎక్కువగా ఉంది. ఈ క్రమంలో చాలా మంది జ్వరం, దగ్గు, జ్వరం తదితర సీజనల్ వ్యాధులకు గురవుతున్నారు.

చిన్నారులు, వృద్ధులు వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఎంతో మంది శ్వాసనాళాలు మూసుకుపోయి ఊపిరాడక అవస్థలు పడుతున్నారు. డాక్టర్ల వద్దకు క్యూ కడుతున్నారు. ఇదే తరుణంలో ఇన్‌ఫ్లూయెంజా అనే వైరస్ సోకే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి..

చలికాలంలో శీతల గాలులు వీస్తున్న నేపథ్యంలో దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న వారు మరింత జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది. మధుమేహం, బీపీ, థైరాయిడ్, అస్తమాతో బాధపడేవారు దగ్గు, ఆయాసం, జలుబు చేస్తే అశ్రద్ధ చేయకుండా వైద్యులను కలిసి చికిత్స పొందాలి. ఇలాంటి వారు ఉదయం, సాయంత్రం వేళ చలిగాలులకు వాకింగ్ పోకపోవడమే మంచిదని వైద్యులు సూచిస్తున్నారు.

ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం



చల్లని గాలులు వీస్తున్న తరుణంలో వైరస్ ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం ఉంది. అస్తమా, బీపీ మధుమేహం, ఊపిరితిత్తుల సమస్యలు ఉన్నవారు చలికి తిరగరాదు. ఇక చిన్నపిల్లలకు జలుబు, కళ్ల మంటలు, జ్వరం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు మొదలైన లక్షణాలు కనిపిస్తాయి. ఇలాంటి సమయంలో పిల్లలకు తగిన చికిత్స అందించి.. విశ్రాంతి ఇవ్వాలి. చలి గాలులకు ప్రభావితం కాకుండా వెచ్చదనాన్ని అందించాలి. వైద్యుల సూచనల మేరకు మందులు వాడాలి.

– డాక్టర్ సతీష్‌రెడ్డి, హిందూపురం

'బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లించాలి'

అమరాపురం: ప్రభుత్వమే పంటల బీమా ప్రీమియం చెల్లించాలని ఎంపీపీ ఈరన్న డిమాండ్ చేశారు. గురువారం సాయంత్రం స్థానిక ఎంపీపీ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతులు ఏ పంట సాగు చేసినా.. బీమా ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లించేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బీమా ప్రీమియం రైతులే కట్టేలా ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. అలాగే కూటమి అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడచినా ఇంత వరకూ పెట్టుబడి సహాయం అందించలేదని గుర్తు చేశారు. రైతుల గురించి పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా రైతుల నుంచి బీమా ప్రీమియం కట్టించకుండా ప్రభుత్వమే చెల్లించేలా చూడాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే గత ఖరీఫ్‌లో అకాల వర్షాల వల్ల రైతులు సాగు చేసిన పంటలు తీవ్రంగా దెబ్బతినడంతో పాటు పూర్తిగా నష్టపోయారని, ప్రభుత్వం స్పందించి రైతులకు బీమా అందజేయాలన్నారు.

డీవీ రమణ లేని లోటు తీర్చలేనిది



డీవీ రమణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి ఉషశ్రీచరణ్

పరిగి:వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శిగా, పెనుకొండ మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్‌గా డీవీ రమణ చేసిన సేవలను పార్టీకి తీరనిలోటని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ తెలిపారు. గురువారం డీవీ రమణ వైకుంఠ సమారాధన కార్యక్రమానికి హాజరైన ఉషశ్రీచరణ్ ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. రమణ చేసిన సేవలను కొనియాడారు. అనంతరం ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి, మండల, స్థానిక నాయకులు ఉన్నారు.

అందాల హరివిల్లు



చిలమత్తూరు: ఆకాశంలో అందాల హరివిల్లు ఆకట్టుకుంది. మేఘాలే ఇంద్ర ధనుస్సును మోస్తున్నట్టు కనిపించి చూపరులను కట్టిపడేసింది. గురువారం 44వ నంబర్ జాతీయ రహదారి కొడికొండ చెక్‌పోస్ట్ సమీపంలో ఇంద్ర ధనుస్సు దృశ్యాలు సాక్షి కెమెరాకు చిక్కాయి.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



ఎంపికైన గ్రామ పంచాయతీ కార్యవర్గ సభ్యులతో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్

పరిగి: గ్రామ స్థాయిలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ తెలిపారు. గురువారం ఆమె మండలంలో విస్తృతంగా పర్యటించారు. తొలుత బీచిగానిపల్లి పంచాయతీ గ్రామాల కార్యకర్తలు, నాయకులతో సమావేశమయ్యారు. గడిచిన ఐదు నెలల్లో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఏమాత్రం నెరవేర్చలేదన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన ఏ పథకాన్ని ప్రజలకు అందించలేకపోయిందన్నారు. ప్రజలకు జరిగిన మోసాన్ని వైఎస్సార్‌సీపీ తరపున ఎండగడదామని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో ఉండింటే ఇప్పటికే ప్రతి ఇంటికీ అన్ని పథకాలు వర్తించేవన్నారు. పేదలను ఆదుకోవాల్సిన ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజలకు తెలియజేసి, చైతన్యవంతులను చేయాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎంపిక..

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు బీచిగానిపల్లి పంచాయతీ కమిటీని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ సమక్షంలో ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. గ్రామ పంచాయతీ అధ్యక్షుడిగా ఎస్.నాగరాజు, ఉపాధ్యక్షులుగా చిక్కేగౌడ, బాలకృష్ణారెడ్డి, అంజి, బి అంజినప్ప, ప్రధాన కార్యదర్శులుగా బాలాజీ, నారాయణరెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడిగా నరసప్ప, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా ఈశ్వరప్ప, రైతు సంఘం అధ్యక్షుడిగా శ్రీరామరెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఎం. రామాంజి, సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా గోవింద్, బూత్ కన్వీనర్‌గా రవి, యూత్ అధ్యక్షుడిగా మారుతీ ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు ప్రకటించారు.

శుభకార్యం

గోరంట్ల: పెనుకొండ మండలం అమ్మావారిపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు సుబ్బిరెడ్డి కుమార్తె వివాహ వేడుకలకు ఎమ్మెల్సీ మంగమ్మ హాజరై,వధూవరులను ఆశీర్వదించారు. గురువారం స్థానిక రాజ్ ఫంక్షన్ హాల్‌లో వివాహం జరిగింది.

నేడు భోజనశాల ప్రారంభోత్సవం

పెనుకొండ: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థుల కోసం దాత ఉమాశంకర్ రూ. 4 లక్షలతో నిర్మించిన భోజనశాల, వంట గదిని శుక్రవారం రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. పెనుకొండలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 40 ఏళ్ల పాటు పీఈటీగా పని చేసిన బీసీ బాబయ్య, అతని భార్య అంజినమ్మ జ్ఞాపకార్థం ఉమాశంకర్ భోజనశాల, వంట గది నిర్మించారు.

వర్షంతో నష్టం

పెనుకొండ: అకాల వర్షంతో తీవ్రంగా నష్టపోయిన వరి, ఇతర పంటలు సాగు చేసి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఏఓ చందనకు రైతు సంఘం నాయకుడు హరి గురువారం విన్నవించారు. తుఫాన్ ప్రభావంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఒకవైపు కల్లాల్లోని వరి మొలకెత్తుతుంటే మరోవైపు పొలాల్లోని కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట నేలవాలి రైతన్నను నష్టపరిచిందన్నారు. గ్రామాల వారీగా సర్వే చేసి రైతన్నలను ఆదుకోవాలన్నారు.

అవినీతి ఆరోపణలపై విచారణ జరిపించాలి

పరిగి: మండలంలోని కొడిగెనహళ్లి ఏపీఆర్ఎస్‌లో పూర్వ విద్యార్థుల సహకారంతో ఇచ్చిన నిధులపై సమగ్ర విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం కొడిగెనహళ్లి ఏపీఆర్ఎస్‌కు వచ్చిన విచారణాధికారులు సురేష్‌కుమార్, వెంకటరమణకు వినతిపత్రాన్ని అందించారు. బాబావలి మాట్లాడుతూ ఇటీవల పాఠశాలలో చెట్లను నరకడం, మరుగుదొడ్ల రిపేరీ వ్యవహారాల్లో అక్రమాలు జరిగాయని ఆరోపించారు. పూర్వ విద్యార్థుల సహకారంతో పాఠశాలకు వచ్చిన డొనేషన్లను పక్కదారి పట్టించినట్లు ఆరోపించారు. సంస్థ ఉన్నతాధికారులు వెంటనే విచారణ జరిపించాలని కోరారు. వినతినిచ్చిన వారిలో పూర్వ విద్యార్థి మురళీ ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

రేపు సుబ్రహ్మణ్య స్వామి రథోత్సవం

పెనుకొండ: పట్టణంలోని సోమేశ్వరస్వామి ఆలయంలో 24వ రథోత్సవం పురస్కరించుకుని ఈనెల 7న సుబ్రహ్మణ్యస్వామి రథోత్సవం ఉంటుందని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. 7న ఉదయం 7 గంటల నుంచి 12 గంటల వరకు గణపతి పూజ, రుద్రాభిషేకం, పూర్ణాహుతిమహా మంగళహారతి 12.35 గంటలకు రథోత్సవంజరుగుతుందన్నారు.

7న భగీరథ కళ్యాణ మండపానికి భూమి పూజ

సోమందేపల్లి: మండల కేంద్రంలోని ఈ నెల 7న భగీరథ కులస్తుల కళ్యాణ మంటపం కోసం భూమి పూజ నిర్వహిస్తున్నట్లు ఉప్పర సంఘం నాయకులు తెలిపారు. గురువారం స్థానిక వైఎస్సార్ సర్కిల్ వద్ద ఉప్పర సంఘం నాయకులు పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో ఉప్పర సంఘం నాయకులు రామచంద్ర, గోపాల్, శేఖర్, శ్రీరామప్ప, శంకరప్ప, నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం

అమరాపురం: మండలంలోని దివ్యాంగులు అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని ఆర్డీటీ సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా అమరాపురం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. బస్టాండులో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. అనంతరం ఉన్నత పాఠశాల మైదానానికి చేరుకుని అక్కడ దివ్యాంగుడు ఓంకారప్ప అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీ మల్లికార్జున, ఎంఈఓ రాఘవయ్య మాట్లాడుతూ దివ్యాంగులకు శిక్షణ ఇప్పిస్తే అన్ని రంగాల్లో రాణిస్తారన్నారు. దివ్యాంగుడు బాలకృష్ణ మాట్లాడుతూ 16 సంవత్సరాల క్రితం వైకల్యం ఏర్పడిందన్నారు. ప్రస్తుతం నడవలేని స్థితిలో ఉన్నా, ట్రై సైకిల్‌కు స్కూటర్ ఏర్పాటు చేసుకుని 400 వక్క చెట్లు పెట్టించి వ్యవసాయం చేయిస్తున్నాని, అలాగే 40 చింత మొక్కలు, మామిడి తోటను సాగు చేశానన్నారు. అలాగే హనుమంతరాయ మాట్లాడుతూ తనకు కళ్లు కనబడకున్నా ఎలక్ట్రికల్ పనులు చేస్తున్నానన్నారు. కార్యక్రమంలో మండలంలోని దివ్యాంగులు పాల్గొన్నారు.

'ఉపాధ్యాయుడి మృతి బాధాకరం'

సోమందేపల్లి/మడకశిర/పెనుకొండ/మడకశిర రూరల్/ పెనుకొండ: ఉపాధ్యాయుడి హత్య ఘటనపై ప్రభుత్వం వెంటనే స్పందించి విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఎస్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆదినారాయణ, స్కూల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మారుతీప్రసాద్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శెట్టిపి జయచంద్రారెడ్డి, ఎం.సుధాకర్, ఫ్యాప్టో నాయకులు డిమాండ్ చేశారు. గురువారం పలు మండలాల్లో ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. రాయచోటిలో ఉపాధ్యాయుడిపై తరగతి గదిలో తొమ్మిదో తరగతి విద్యార్థులు దాడి చేయడంతో.. ఆ ఉపాధ్యాయుడు మృతి చెందాడన్నారు. ఈ ఘటన ఉపాధ్యాయులను తీవ్రంగా కలచి వేసిందని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఉపాధ్యాయులకు రక్షణ కరువైందన్నారు. ఉపాధ్యాయులపై ఒత్తిడిని తగ్గించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

రైతులను ఆదుకోవాలి



తడిసిన వరిని చూపుతున్న రైతులు

పెనుకొండ రూరల్: ఇటీవల తుపానుతో కారణంగా నష్టపోయిన వరి రైతులను ఆదుకోవాలనిరైతు సంఘం నాయకులు కోరారు. కురుబవాండ్లపల్లి, హరిపురం గ్రామాలకు చెందిన రైతులు కోతలు అనంతరం వరి పంటను కళ్లాలలో ఆరబోసినట్లు తెలిపారు. ప్లాస్టిక్ పట్టలతో భద్రపరిచినా, తుపాను వల్ల కళ్లాల్లోనే గింజలు మొలకెత్తినట్లు పేర్కొన్నారు. రైతులు నరేష్, లక్ష్మన్న, చంద్ర,రాజా, అంజనేయులు, వీరజిన్నప్ప నష్టపోయారన్నారు.

వివాదాస్పద స్థల పరిశీలన



దేవాలయ స్థలాన్ని పరిశీలిస్తున్న ఏసీ గూటూరు శివప్ప

పావగడ: పట్టణంలోని శ్రీనివాస నగర్‌లో కన్యకా పరమేశ్వరి దేవాలయం ట్రస్ట్ పేరుతో నాలుగు ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించారు. తనిఖీ జరిపి ఆ స్థలాన్ని విడిపించాలని ఇటీవల స్థానిక సామాజిక కార్యకర్తలు వీర్లగొంది నరసింహయ్య, ఆప్ జిల్లా సంఘటనా కార్యదర్శి ఎస్ రామాంజినప్ప రాష్ట్ర భూ కబ్జా న్యాయాలయంలో దావా వేశారు. ఈ నేపథ్యంలో మధుగిరి ఉప విభాగం ఏసీ గూటూరు శివప్ప, స్థానిక తహసీల్దార్ వరదరాజు, మున్సిపల్ ముఖ్యాధికారి జాఫర్ షరీఫ్ వివాస్పద స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వీర్ల గొంది నరసింహయ్య, రామాంజినప్ప మాట్లాడుతూ పట్టణంలోని శ్రీనివాస నగర్ సర్వే నంబర్ 72, 74లో నాలుగు ఎకరాల ప్రభుత్వ స్థలం కబ్జాకు గురైందని ఆరోపించారు. అలాగే ఈ స్థలంలో దేవదాయ శాఖకు చెందిన నీలకంఠేశ్వరస్వామి దేవాలయం, కళ్యాణి, జంగమల మఠం, జంగమల స్వామీజీల సమాధులున్నాయన్నారు. అలాగే 40 ఏళ్ల క్రితం కొంత మంది ఆర్య వైశ్య సంఘం నాయకులు దేవదాయ శాఖకు చెందిన నీలకంఠేశ్వర స్వామి దేవాలయం పేరును చెరిపేసి కన్యకాపరమేశ్వరి దేవాలయంగా మార్చారని ఆరోపించారు. ఆ స్థలంలో సుమారు 40 ఇళ్లను నిర్మించారన్నారు. వెంటనే ఆక్రమిత స్థలాన్ని విడిపించి నీలకంఠేశ్వర దేవాలయాన్ని పునర్మించాలని అంబేడ్కర్ భవనం, గ్రంథాలయం నిర్మించి అన్ని జాతుల వారికి అనుకూలమయ్యేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

అధికారులను అడ్డుకున్న పందుల పెంపకందారులు

మడకశిర: పట్టణంలో గురువారం మున్సిపల్ అధికారులను పందుల పెంపకందారులు అడ్డుకున్నారు. వివరాలు. పట్టణంలో ఇటీవల పందుల సంచారం ఎక్కువగా ఉంది. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుడంతో పాటు ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. అంతేకాకుండా మున్సిపాలిటీ పరిధిలో మలేరియా, టైఫాయిడ్ జ్వరాలు సోకి ప్రజలు ఆస్పత్రుల పాలవుతున్నారు. పందుల సంచారంతోనే జ్వర పీడితులు పెరుగుతున్నారని, దీంతో పందులను పట్టి ఊరికి దూరంగా ఉంచాలని ప్రజలు మున్సిపల్ అధికారులకు పలు సందర్భాల్లో ప్రజలు ఫిర్యాదులు చేశారు. మున్సిపల్ కమిషనర్ రంగస్వామి ఆదేశాల మేరకు అధికారులు గురువారం పట్టణంలోని పందులను పట్టి ఊరికి దూరంగా ఉంచడానికి చర్యలు తీసుకున్నారు. పందులను పట్టుకుంటున్నప్పుడు పెంపకందారులు అడ్డుకున్నారు. చెప్పా పెట్టకుండా పందులను పట్టుకుని తమ పొట్ట కొడితే ఎలా? అని ప్రశ్నించారు. గడువిస్తే తామే పందులను ఊరికి దూరంగా ఉంచడానికి ఏర్పాట్లు చేసుకుంటామని మున్సిపల్ అధికారులకు తెలిపారు. రెండు, మూడ్రోజుల్లోగా పందులను ఊరికి దూరంగా ఉంచుకోవాలని మున్సిపల్ అధికారులు పందుల పెంపకందారులకు గడువిచ్చారు. దీంతో వివాదానికి తెరపడింది.

సన్మార్గంలో జీవించేలా ప్రోత్సహించాలి



మాట్లాడుతున్న మిషన్ చైర్మన్ టీఎం త్యాగరాజ్

హిందూపురం టౌన్: ప్రజలందరూ సన్మార్గంలో జీవించేలా పాస్టర్లు ప్రోత్సహించాలని సిలోన్ అండ్ ఇండియా జనరల్ మిషన్ కేంద్ర కార్యాలయ మిషన్ చైర్మన్ రెవరెండ్ డాక్టర్ టీఎం త్యాగరాజు సూచించారు. గురువారం పట్టణంలోని సీఅండ్ఐజీ మిషన్ చర్చ్ కాంపౌండ్ ఆధ్వర్యంలో క్రిస్మస్ సంబరాల్లో భాగంగా సిలోన్ ఇండియా జనరల్ మిషన్ ఆంధ్రప్రదేశ్ పాస్టర్ల ఒక్క రోజు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మిషన్ చైర్మన్ మాట్లాడుతూ.. సర్వ మానవాళి రక్షణ కోసం యేసుక్రీస్తు జన్మించాడన్నారు. ఈ సువార్త మానమును ప్రజలకు తెలియజేయడమే క్రిస్మస్ పండుగ అని వివరించారు. క్రిస్మస్ క్యారల్స్‌ను ఆలపించారు. నూతనంగా మిషన్ డైరెక్టర్‌గా నియమింపబడిన రెవరండ్ డాక్టర్ నాతన్, ఏజీ మెంబర్ నాగేంద్ర కుమార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో మిషన్ సెక్రటరీ బెంజమిన్ తిమోతి, కోశాధికారి గిడియోన్, వైస్ చైర్మన్ ఐజయ్య, డైరెక్టర్ నాతాన్, సంఘ పాస్టర్ స్టీఫిన్ రాజ్, కార్యదర్శి నాగేంద్ర కుమార్, జాయింట్ సెక్రటరీ సాల్మన్ రాజ్, డీకెన్ బోర్డు మెంబర్లు దేవరాజ్, జార్జి బాబు పాల్గొన్నారు.

సేంద్రియ సాగు.. లాభాలు బాగు



ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేసిన దృశ్యం

అగళి: మండలంలోని ఇనగలూరు రైతు సేవా కేంద్రంలో ప్రపంచ నేల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ శేఖర్ నాయక్ మాట్లాడుతూ రైతులు తమ భూముల సారవంతం చేసుకోవడానికి రసాయనిక ఎరువులు వాడకం తగ్గించి, సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గు చూపాలనిన్నారు. భూమి సారవంతంగా ఉంటేనే అధిక దిగుబడి సాధ్యమన్నారు.

లేపాక్షి: లేపాక్షిలోని జవహర్ నవోదయ విద్యాలయంలో గురువారం ప్రపంచ మట్టి ఆరోగ్య దినోత్సవం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నాగరాజు, హిందూపురం వ్యవసాయ డివిజన్ ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్ మాట్లాడుతూ.. మట్టి సమర్థతను పరిగణలోకి తీసుకుని ప్రకృతి వనరులను సంరక్షించే పద్ధతులను తెలియజేశారు. వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చాటిన వారికి, వ్యవసాయంలో విశిష్ట సేవలు అందించిన రైతులకు బహుమతులు అందజేశారు. వ్యవసాయాధికారులు సనావుల్లా, శ్రీలత, రవీంద్ర, రుమాన బేగం, ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.